ఫుట్‌పాత్‌లే వ్యాపార కేంద్రాలు



ఆత్మకూరు బస్టాండ్ వద్ద రోడ్డుపైనే విక్రయాలు



వీఆర్సీ క్రీడా మైదానం ముందు ఫుట్‌పాత్‌పై జోరుగా బొమ్మల విక్రయాలు

- యథేచ్ఛగా ఆక్రమణలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ అధికారులు

నెల్లూరు నగర విస్తీర్ణం: 150 కి.మీ
నగర జనాభా : 8 లక్షలకు పైగా
డివిజన్లు : 54

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతూ ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్నాయి. దీనిపై అటు టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో పలు వాణిజ్య ప్రాంతాలు, ఆలయ సముదాయాల వద్ద నిత్యం ట్రాఫిక్‌జామ్‌లు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

➡ నగరంలోని మినీబైపాస్‌రోడ్డు వెంబడి షెడ్లు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ షెడ్లను అంతకంతకూ పెంచుకుంటూ రోడ్డు ఆక్రమణలకు పాల్పడడం, అక్కడికి వచ్చే ఆహార ప్రియులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి.

➡ నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, బాలాజీనగర్, ముత్తుకూరుగేట్ వద్ద ఉన్న సర్వేపల్లి కాలువ బ్రిడ్జిలపై ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించేసి పండ్లు, కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరపడంతో పాదచారులకు అనేక అవస్థలు వస్తోంది. అలాగే స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలో షాపుల ముందు పండ్ల దుకాణాలు ఉండడంతో రాకపోకలకు కష్టంగా మారింది.

➡ చిన్నబజార్, పెద్దబజార్, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో రోడ్లపైనే పలు దుకాణాలు వెలిశాయి. దీంతో వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

➡ చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో దుకాణాల ముందున్న ఫుట్‌పాత్‌లను సదరు యజమానులు ఆక్రమించేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అలాగే వీఆర్సీ క్రీడా మైదానం ముందున్న ఫుట్‌పాత్‌పై ఏర్పాటైన బొమ్మల దుకాణం, వీఆర్సీ కళాశాల ప్రహరీని ఆనుకుని రోడ్డుకిరువైపుల అనధికారికంగా వెలిసిన పండ్ల దుకాణాలు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు దారితీస్తున్నాయి.

ఆక్రమణలు తొలగించాలి

నెల్లూరు కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయం లోపించడంతోనే రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురువతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి స్పెషల్ డ్రైవ్ పేరున ఆక్రమణల తొలగింపునకు పూనుకునే అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. దీంతో మళ్లీ ఆక్రమణలు వెలుస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు పట్టించుకుని ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.



ఆత్మకూరు బస్టాండ్ సుబేదారుపేట ప్రాంతంలో ఆక్రమణకు గురైన రోడ్డు



చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణం

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



వైఎస్ జగన్‌తో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంపై పలు అంశాలు చర్చించారు.

సీతారామ్ ఏచూరికి ఘన నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరికి నగరంలోని ముత్తుకూరు గేట్ సెంటర్ 16వ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఘన నివాళి అర్పించారు. ఆయన సేవలను పలువురు నేతలు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసులు, నరసింహ, కత్తి పద్మ, ఆనంద్‌కుమార్, సంపూర్ణమ్మ, మస్తానమ్మ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరనిలోటు

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి భారతదేశానికి తీరని లోటు అని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకమ్మరాజు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలియజేశారు.

వినాయకస్వామి దేవస్థానంలో వార్షిక వేడుక



నెల్లూరు(బృందావనం) : నగరంలోని ట్రంకు రోడ్డు శివాజీ సెంటర్‌లో వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం 25వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు వి.సతీష్ శర్మ ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, పూజలు, పూర్ణాహుతి, పవిత్ర కుంభజలాల ప్రోక్షణ, ఆలయశిఖర ప్రోక్షణ తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో శివాజీనగర్ మిత్రమండలి నిర్వాహకుడు పి.సురేంధర్‌రెడ్డి, సభ్యులు కేవీ సుబ్రహ్మణ్యం, పేటేటి భాస్కరరావు, మిడతల రమేష్, బీఎస్ రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి లోపం ఉన్న పిల్లలకు యంత్రాలు



పిల్లలను పరీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్) : వినికిడి లోపంతో బాధపడుతున్న 18 ఏళ్లలోపు పిల్లలకు వినికిడి యంత్రాలు ఏర్పాటు చేయడం సంతోషకరమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య అన్నారు. లోపాలున్న పిల్లలను గుర్తించి వారికి యంత్రాలు అమర్చే క్యాంపు పెద్దాస్పత్రి ఆవరణలోని బాలభవిత కేంద్రంలో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో వినికిడి యంత్రాలు అమర్చుతున్నామన్నారు. పూర్తి వివరాలకు డైస్ మేనేజర్ జమీర్ 93814 68458 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, సురేష్‌బాబు, ఆడియాలజిస్ట్ వినీల పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

నెల్లూరు(దర్గామిట్ట) : యువతకు ఉద్యోగ కల్పన కోసం దేశంలోనే ప్రఖ్యాత 30 కంపెనీలతో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్కెట్లోకి కొత్త ఎస్‌యూవీ

నెల్లూరు (టౌన్) : కాకుటూరులోని కున్ హ్యుండాయ్ షోరూమ్‌లో హ్యుండాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ 7 సీటర్ ఎస్‌యూవీ అల్కాజర్ కొత్త వెర్షన్‌ను వ్యాపారవేత్త బిజ్జివేముల రమణారెడ్డి గురువారం మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ కారు పెట్రోల్, డీజిల్ వేరియంట్లల్లో లభిస్తుందన్నారు.

ఘనంగా 16 రోజుల పండగ

నెల్లూరు(బృందావనం) : వేదాయపాలెం గాంధీనగర్‌లో ఉన్న కృష్ణమందిరంలో గురువారం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామికి 16 రోజుల పండగను గురువారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు బి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిపించారు. ఉభయకర్తలుగా కనియంపాటి మాల్యాద్రి– మహాలక్ష్మి, ఆర్.రామసుబ్బు–వాసుకి, ఆర్.కనకరాజు– శరణ్య దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో మందిర ధర్మకర్త సీహెచ్.వెంకటేశ్వర్లు, కమిటీ గౌరవాధ్యక్షుడు తిక్కవరపు శ్రీనివాసులురెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీవీ రాఘవేంద్ర, ఎస్.సుబ్బరామరాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలపై ఐఏబీలో నిర్ణయం

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(సెంట్రల్) : సాక్షి దినపత్రికలో ఈనెల 10వ తేదీన 'నీరు లేక.. సాగు చేయలేక' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఇరిగేషన్ అధికారులు స్పందించారు. సోమశిల ప్రాజెక్టులో నీటి లభ్యతను బట్టి ఐఏబీ సమావేశంలో నిర్ణయం తీసుకుని రైతులకు సకాలంలో నీటి విడుదల చేస్తామని ఇరిగేషన్ కార్యాలయ పర్యవేక్షణ ఇంజినీర్ కృష్ణమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సమగ్రశిక్ష పరిశీలకులు కల్పన శైల

నెల్లూరు (టౌన్) : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకులు కల్పన శైల తెలిపారు. అభ్యసన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా బ్రహ్మదేవి, ముత్తుకూరులోని జెడ్పీ హైస్కూల్స్‌ను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో పాఠ్యాంశ బోధనా విధానాలు, ఏ విధంగా బోధన జరుగుతుందో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల్లోని 20 పాఠశాలల్లో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (లిప్) జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, బాలరక్ష భారత్ ప్రతినిధి రఫీ, ఎంఈఓలు మధుసూదన్, హేమసుందర్, హెడ్‌మాస్టర్లు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో అరుదైన ఆపరేషన్



దవడవాపుతో ఉన్న చెంచులక్ష్మి



తొలగించిన దంతం

నెల్లూరు(అర్బన్) : నోటిలోని దంతం(పన్ను) సాధారణంగా పైకి పెరుగుతుంది. అయితే రివర్స్‌లో దవడ కింద పెరుగుతూ రావడం వల్ల పెద్ద గడ్డ ఏర్పడి చీము పట్టిన ఓ బాలికకు నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో గురువారం అరుదైన ఆపరేషన్ను విజయవంతంగా పూర్తి చేశారు. వివరాలు.. ఆత్మకూరు నియోజకవర్గం పడమటిపాళేనికి చెందిన తిరుపతయ్య, శ్రావణిల కుమార్తె మానికల చెంచులక్ష్మికి కొంత కాలంగా కుడివైపు దవడ కింద నొప్పి వస్తోంది. అంతేకాకుండా దవడ వాపు క్రమేపి పెరగడంతో నొప్పి తీవ్రంగా ఉండేది. ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకుంటే ఆపరేషన్ చేయాలని అక్కడి డాక్టర్లు చెప్పారు. పరీక్షలు, ఆపరేషన్ ఖర్చు సుమారు రూ.లక్ష అవుతుందని చెప్పడంతో స్థోమత లేక ఆ తల్లిదండ్రులు బాలికను రెండు రోజుల క్రితం నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి తీసుకొచ్చారు. ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ సుకుమార్ ఎక్స్‌రే, ఇతర పరీక్షలు చేసి ఒక దంతం దవడలో నోటి దిగువకు పెరుగుతుందన్నారు. వాస్తవానికి డెంటిస్ట్ డాక్టర్ వైద్యం చేయాల్సి ఉంది. అయితే పెద్దాస్పత్రి దంత విభాగంలో అన్నిరకాల పరికరాలు లేవు. అంతే కాకుండా దంత వైద్యుడు విధులకు సక్రమంగా రాకపోవడంతో ఆ డాక్టర్‌ను డీఎంఈకి సరెండర్ చేశారు. ఈ నేపథ్యంలో ఈఎన్‌టీ డాక్టర్ సుకుమార్ టీమ్ రిస్క్ తీసుకుని ఆపరేషన్ చేశారు. దవడ కిందకు పెరిగిన దంతాన్ని సైతం తొలగించారు. ప్రస్తుతం వాపు తగ్గిపోయింది. బాలిక చికిత్స పొందుతోంది. ఈ సందర్భంగా ఈఎన్‌టీ డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ సహకారంతోనే రిస్క్ కేసులు సైతం విజయవంతంగా చేస్తున్నామన్నారు. ఈఎన్‌టీ డాక్టర్లు శ్రీదేవి, కల్యాణితో పాటు మత్తు డాక్టర్లు సత్యనారాయణ, ఎంకే రెడ్డి ఆపరేషన్‌లో కీలకపాత్ర పోషించారన్నారు. నర్సింగ్ సిబ్బంది సహకరించారన్నారు.

సీపీఎం పోరాటంతోనే భారీ వాహనాల నియంత్రణ



పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో భారీ వాహనాల రాకపోకల నియంత్రణతో పాటు చిల్డ్రన్స్ పార్కు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులను అన్యాక్రాంతం కాకుండా చేసిన ఘనత సీపీఎంకే దక్కిందని ఆ పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, 16వ డివిజన్ కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు అన్నారు. నగరంలోని 16వ డివిజన్‌లో సీపీఎం మహాసభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నగరంలో పేదలు ఉండే ప్రాంతాల్లో ఇళ్లకు రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఫ్లైఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా కార్యదర్శి సంపూర్ణమ్మ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జి.నాగేశ్వరరావు, నరసింహ, 'సుధాకర్, నారాయణ, కుమార్, సుబ్బు, బాబు, వెంకటేశ్వర్లు, రాజా తదితరులు పాల్గొన్నారు.

వారణాసిలో సింహపురి చిన్నారుల ప్రతిభ



సత్కారాలు అందుకున్న నెల్లూరు చిన్నారులతో నాట్యగురువు శ్రావణిసునీత

నెల్లూరు(బృందావనం) : ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలకు సంబంధించి గిన్నీస్ రికార్డుల కోసం నిర్వహించిన మెగా ఈవెంట్‌లో నెల్లూరుకు చెందిన చిన్నారులు పతకాలను, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలను సరస్వతీనగర్‌లోని శివనృత్య కళానిలయం నాట్యగురువు శ్రావణిసునీత గురువారం వెల్లడించారు. గిన్నీస్ రికార్డుల కోసం 36 గంటల కూచిపూడి, భరత నాట్య నృత్య ప్రదర్శనకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 1000 మందికి పైగా కళాకారులు పాల్గొని తమ నృత్య ప్రదర్శనలతో అలరించారన్నారు. వీరిలో నెల్లూరుకు చెందిన 12 మంది చిన్నారులు పాల్గొని ప్రతిభచాటి జ్ఞాపికలు, సత్కారాలు అందుకున్నారని తెలిపారు.

ఆటో.. ఇటో అటో!



ఆత్మకూరు బస్టాండ్ వద్ద రోడ్డుకి ఇరువైపులా..



గాంధీబొమ్మ సెంటర్‌లో రహదారి నిండా..

నెల్లూరు నగరం రోజురోజుకీ విస్తరిస్తోంది. దీంతో వాణిజ్య, వ్యాపార సంస్థలు అనేకం వెలుస్తున్నాయి. వీటితోపాటు వాహనాల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా ఆటోలు విపరీతంగా పెరిగిపోయాయి. నగరంలో ప్రధాన రహదారి అయిన జీఎన్‌టీ రోడ్డులో ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు ప్రయాణం చేయాలంటే ఇక్కట్లు పడాల్సిందే. ఏ వైపు నుంచి ఏ ఆటో దూసుకు వస్తుందో తెలియని పరిస్థితి. ఆటోలను ఎక్కడపడితే అక్కడ నిలపడం వలన ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్ కంట్రోల్ చేయడం పోలీసులకు కూడా తలనొప్పిగానే మారింది. అయినా ఆటోలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, నెల్లూరు

భర్త అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : భార్యపై అలిగి ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని ఫత్తేఖాన్‌పేటకు చెందిన మనోహర్‌లాల్ నగరంలోని ఓ షాపింగ్‌మాల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అతని క్రెడిట్ కార్డును భార్య పూర్ణిమ వాడుకున్నారు. ఈ విషయమై భార్య భర్తల నడుమ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఈనెల 11వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయారు. అప్పటి నుంచి జాడ తెలియరాలేదు. ఈమేరకు పూర్ణిమ గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ ఎస్.మునికృష్ణయ్య మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

జిల్లా మహిళకు అరుదైన చికిత్స

నెల్లూరు(అర్బన్) : జన్యు సంబంధిత లోపాలతో పల్మనరీ హైపర్ టెన్షన్ వల్ల గుండె కుడివైపు పనితీరు ఫెయిలై ప్రాణాపాయ స్థితిలో ఉన్న జిల్లాకు చెందిన మహిళకు అరుదైన చికిత్స చేసి ప్రాణాలు కాపాడామని చెన్నై గ్లెనెగల్స్ హాస్పిటల్స్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ గురుప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక దర్గామిట్టలోని ఓ హోటల్‌లో కోలుకున్న మహిళతో కలిసి గురువారం వెల్లడించారు. ఏఎస్‌పేట గ్రామానికి చెందిన 32 ఏళ్ల నారాయణమ్మ 12 ఏళ్లుగా పల్మనరీ హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారు. ఈ క్రమంలో అమెరికా లాంటి దేశాల్లో ప్రారంభమైన పల్మనరీ డినెర్వేషన్ అనే చికిత్సను ఇండియాలో తొలిసారిగా తమ గ్లెనెగల్స్ ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ ద్వారా చికిత్స చేశామన్నారు. ఆమె వేగంగా కోలుకుందన్నారు. కార్యక్రమంలో గుండె మార్పిడి డాక్టర్ సుబ్రమణి, డాక్టర్ సింధూర, మేనేజర్ గీత్‌ఆనంద్‌లు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి



డీలర్లతో మాట్లాడుతున్న సత్యవాణి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి అన్ని రకాల ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి తెలిపారు. నెల్లూరులోని ఆ శాఖ కార్యాలయంలో ఎరువుల విక్రయదారులు, విత్తనాల ఉత్పత్తిదారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలిచ్చేలా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. 1.20 లక్షల టన్నుల యూరియా, 1.23 లక్షల డీఏపీతో పాటు మరికొన్ని రకాల ఎరువులు సిద్ధంగా ఉంచాలన్నారు. లక్ష రకాల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రధానంగా జిల్లాలో అవసరమైన కేఎన్‌ఎం – 1638, కేఎన్ఎం – 733, ఆర్ఎన్ఆర్ – 15048, బీపీటీ – 5204, ఎన్ఎల్ఆర్ – 34449 విత్తనాలు ఎక్కువగా అందుబాటులో ఉంచాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. బిల్లులు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

320 మంది విద్యార్థులకు పురస్కారాలు



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పుర మందిరంలో ఇంటర్నేషనల్ హెల్పింగ్ ఆర్మ్స్ అసోసియేషన్ నిర్వాహకుడు డాక్టర్ గంగపట్నం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన 320 మంది విద్యార్థులకు రూ.3.35 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గుండె వ్యాధి నిపుణుడు డాక్టర్ సి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ గంగపట్నం సుబ్రహ్మణ్యం ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన వంతుగా పదో తరగతి విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. గత 20 ఏళ్లుగా చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో సంతృప్తిని ఇస్తోందన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.